క్లుప్తంగా

రూరల్ సీఐగా సుధాకర్ బాధ్యతల స్వీకారం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ సీఐగా యు.సుధాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ మాట్లాడుతూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కనిగిరి, పొదిలి, తుళ్లూరు, తెనాలిరూరల్, మేడికొండూరు, గిద్దలూరు స్టేషన్‌లలో విధులు నిర్వహించానని తెలిపారు. వినుకొండ రూరల్ పరిధిలోని నాలుగు మండలాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. ఇప్పటివరకు రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రమేష్‌బాబు జిల్లా రేంజ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన చిట్యాల నాగార్జునరెడ్డి తన జన్మదినం సందర్భంగా ద్విచక్రవాహనంపై పురుషోత్తమపట్నంలో ఉన్న సాయిబాబా మందిరానికి వెళ్లి పూజలు నిర్వహించాడు. తిరుగు ప్రమాణంలో వినాయకుడి గుడి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన వృద్ధుడిని తప్పించబోయి వాహనం అదుపుతప్పి కింద పడి పోయాడు. ఈ క్రమంలో అటుగా వెళుతున్న లారీ టైరు కిందకు ఎడమ కాలు వెళ్లింది. ఈ ప్రమాదంలో నాగార్జునరెడ్డి ఎడమకాలు విరిగింది. 108 సిబ్బంది బాధితుడిని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

బస్‌స్టేషన్ల ఆధునికీకరణపై నేడు సమావేశం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని వినుకొండ, నరసరావుపేట ఆర్టీసీ బస్‌స్టేషన్లను పీపీపీ పద్ధతిలో ఆధునికీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా ప్రజారవాణాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం 11.30గంటలకు స్థానిక జిల్లా ప్రజారవాణాశాఖాధికారి కార్యాలయంలో వ్యాపార సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ఉత్సాహవంతులైన వ్యాపారులు పాల్గొని అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

20న వాహన వేలం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఉపయోగంలో లేని జీపును మిషన్ శోభకృత్ -2023లో భాగంగా ఈ నెల 20వ తేదీ ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. 40 సంవత్సరాల క్రితానికి చెందిన ఈ వాహనం ఉపయోగంలో లేదని తెలిపారు. ఆసక్తి దారులు వేలానికి ముందే వాహనాన్ని పరిశీలించుకోవచ్చని, వేలం అధికారి వద్ద రూ.వెయ్యి డిపాజిట్ చేయాలని, గెలుపొందిన తరువాత డిపాజిట్ వాపస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాట దక్కించుకున్న వ్యక్తి వాహన చట్టం కింద వాహనం రిజిస్ట్రేషన్‌కు అయ్యే అన్ని ఖర్చులు భరించాలని, వారి నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

యడ్లపాడు: వివాహిత అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపురం ఎస్సీకాలనీకు చెందిన యేసు మరియమ్మకు రెంటపాళ్లకు చెందిన బత్తుల బాబురావుతో పది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి సంతానం లేకపోవడంతో మరియమ్మను బాబూరావు వేధింపులు గురిచేయసాగాడు. దీంతో మరియమ్మ పుట్టిల్లు తిమ్మాపురం వచ్చింది. ఈస్టర్ పండుగనాడు భర్త బాబూరావు వచ్చి తీసుకువెళ్తానన్నా తిరిగి వెళ్లలేదు. ఈనెల 9వ తేదీన రాత్రి తల్లి నిద్రిస్తుండగా మరియమ్మ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. అల్లుడు బాబూరావుకు ఫోన్‌చేసినా అక్కడకు రాలేదంటూ సమాధానం చెప్పడంతో బంధువులను ఆరా తీశారు. ఎక్కడా కూతురి ఆచూకీ లభించపోవడంతో తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. యడ్లపాడు ఎస్ఐ షైడి రాంబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీహెచ్‌సీలో ఎన్‌కాస్ బృందం తనిఖీలు

ముప్పాళ్ల: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై జాతీయ నాణ్యతా ప్రమాణం సూచి సర్వే(ఎన్‌కాస్) బృందం ప్రతినిధులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. నాణ్యతా ప్రమాణం అంచనా కేంద్ర బృందం ప్రతినిధులు డా.కె.ఏ.జితీష్, డా.కవిత లు ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి లాబోరేటరీ, ఫార్మశీ, వార్డు, లాబర్ రూమ్ లను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారం రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ముందుగా నూతనంగా ఏర్పాటు చేసిన మాతాశిశు విగ్రహం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి విగ్రహాని ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా వైద్యాధికారి డా.శోభారాణి, జిల్లా ఎన్‌కాస్ అసోసియేట్ డా.రాంప్రసాద్, గుంటూరు జిల్లా ఎన్‌కాస్ అధికారి డా.శివతేజ, ముప్పాళ్ళ పీహెచ్‌సీ వైద్యులు రమాదేవి, జయకృష్ణప్రవీణ్, రొంపిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి స్వాతి పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ఆరోగ్య ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసన సభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 22 మంది బాధితులకు రూ.18.81లక్షల సీఎం ఆర్థిక సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని పేదలను ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఆరోగ్య శ్రీ అనుమతులు ఉన్న వైద్యశాలలోనే చికిత్స చేయించుకోవాలని అన్నారు. చాలా రకాల వ్యాధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకంలో చేర్పించడం జరిగిందని, అన్ని వైద్య సౌకర్యాలు, ఆయా విభాగాల్లో నిపుణులు ఉన్న ఆసుపత్రులకు మాత్రమే ఆరోగ్య శ్రీ అనుమతులను ప్రభుత్వం కల్పించిందన్నారు.

జీవీ అవినీతి బాగోతం మొత్తం వెలికితీస్తాం ...

చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అవినీతి బాగోతాన్ని ఆధారాలతో సహా బయటపెట్టామని, అయ్యన్నపాలెం, కొప్పుకొండ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే జీవీ, ఆయన అనుచరులు ఆక్రమించుకున్న భూములను ఇప్పటికే ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, త్వరలోనే ఆ భూములు అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామన్నారు. అలాగే జీవీ అవినీతి చిట్టా ఇంకా ఉందని, పూర్తిస్థాయిలో వెలికితీస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అనవసరమైన విమర్శలు మానుకొని నిజాయతీగా ఉండాలని హితవుపలికారు. కార్యక్రమంలో ఐదు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, బాధితులు పాల్గొన్నారు.

కొంకేరువాగుపై త్వరలో బ్రిడ్జి నిర్మాణం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని ఏనుగుపాలెం, పెరుమాళ్లపల్లి గ్రామాల మధ్యన కొంకేరు వాగు మీద బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి పెరుమాళ్లపల్లి, ఏనుగుపాలెం మధ్య, పెరుమాళ్లపల్లి నుంచి వినుకొండకు రాకపోకలకు ఈ కొంకేరు వాగు వలన చాలా ఇబ్బందిగా ఉండేదని, ఈ వాగు వలన ఈ రెండు గ్రామాల మధ్య 2 కిలోమీటర్లు ఉన్న దూరం సుమారు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని గ్రామస్తులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. సంబంధిత అధికారులతో కలిసి బ్రిడ్జి నిర్మాణానికై వాగును పరిశీలించడం జరిగిందన్నారు. ఈ గ్రామాల ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే ఈ బ్రిడ్జి నిర్మించడం తన బాధ్యత అని, త్వరలోనే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులను కూడా మంజూరు చేస్తామన్నారు. భూసర్వే, బ్రిడ్జి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో పెరుమాళ్లపల్లి, ఏనుగుపాలెం గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేరనుంది. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి వాగు పరిసరాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఎడ్ల యజమానులకు, వీక్షకులకు అన్నదానం

వినుకొండ టౌన్: ఎడ్ల బల ప్రదర్శనలో ఎడ్ల యజమానులకు, వీక్షకులకు అన్నదాన కార్యక్రమాన్ని వినుకొండ రూరల్ మందమంచిపాటి వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వీరాంజనేయ స్వామి తిరునాళ్లను పురస్కరించుకొని, తిరునాళ్ల అనంతరం ఆలయానికి చేరువలోనున్న మక్కెన చినరామయ్య క్రీడా ప్రాంగణంలో జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో తన తండ్రి, పెదకంచర్ల గ్రామ మాజీ సర్పంచి మక్కెన చినరామయ్య జ్ఞాపకార్థం 2006 నుంచి ఎడ్ల యజమానులకు, రైతులకు, వీక్షకులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోటప్ప నగర్ సర్పంచి నంబూరు శ్రీనివాసరెడ్డి, జంగాల పల్లె సర్పంచి బుడ్డయ్య, గుడివాడ గురునాథం, రెడ్డి వెంకటరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

కుక్కను తప్పించబోయి పల్టీ కొట్టిన కారు

- ముగ్గురికి స్వల్పగాయాలు
- క్షతగాత్రుల్లో నెల్లూరు టీచర్ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి మామ


యడ్లపాడు: రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో బుధవారం జరిగిన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం వేడుకల్లో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన కారు బోల్తా పడింది. నెల్లూరు జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మామ మల్లారెడ్డి మరోఇద్దరు ఉన్న కారు పల్నాడు జిల్లా యడ్లపాడు నక్కవాగు సమీపంలోకి రాగానే అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కారు అదుపు తప్పి ఎక్స్‌ప్రెస్ హైవేపై నుంచి పల్టీలు కొడుతూ ఆరడుగులు కిందకు ఉన్న సర్వీసు మార్గంలోకి వెళ్లి పడింది. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో మల్లారెడ్డితో పాటు కారులోని మిగిలిన ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనం సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని చిలకలూరిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు.



హైవేపై నుంచి సర్వీస్ మార్గంలోకి దూసుకొచ్చిన కారు

ముగిసిన పోలేరమ్మ తిరునాళ్ల

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి దేవాలయ వార్షిక తిరునాళ్ల మహోత్సవం బుధవారం తెల్లవారుజాముతో ముగిశాయి. గత మూడు రోజులుగా ఆలయంలో చండీహోమం, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకాలు, లక్ష మల్లెలతో అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం తీన్‌మార్ వాయిద్యాలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కుంకుమపూజలు, పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది. ఆయా ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



తిరునాళ్లలో ఆకట్టుకున్న విద్యుత్‌ప్రభ

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు చొరవతో రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు, సత్తెనపల్లి కమిటీ సభ్యులు సంయుక్తంగా వంటపాత్రలు, టార్పాలిన్‌పట్టలు, హైజిన్ కిట్స్ బుధవారం అందించారు. బాధితులను పరామర్శించి వారికి అవసరమైన నిత్యావసర సామాగ్రిని అందించారు. జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్, కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేర రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డా.కంజుల జగన్మోహనరెడ్డి, తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, రెడ్‌క్రాస్ సభ్యులు బత్తులమురళి, కె.ఎం.యస్.వి.శ్రీనివాసగుప్తా, ఆంజనేయులు, మేనేజింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, డి.కోటేశ్వరరావు, కె.శ్రీరత్నం, ఎస్.భుజంగరావు, సత్తెనపల్లి సబ్‌బ్రాంచ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బాధితులకు సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, తహసీల్దార్ భవానీశంకర్

బుక్కాపురం సర్పంచ్ రాజీనామా

నాదెండ్ల: నాదెండ్ల మండలం, బుక్కాపురం గ్రామ సర్పంచ్ అల్లడి రవికుమార్ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డికి స్వయంగా అందించారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. అయితే 2021 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ మద్దతు గల అభ్యర్థులు సర్పంచి పదవికి పోటీ పడ్డారు. గ్రామ పెద్దలు ఇరువురి మధ్య రాజీ కుదిర్చి మొదటి రెండేళ్లు అల్లడి రవికుమార్‌కు అవకాశం ఇచ్చారు. దీంతో ఆయన రాజీనామా చేసినట్లు తెలిసింది. ఉపసర్పంచ్‌గా ఉన్న అల్లం ఆంజనేయులుకు ఇన్‌చార్జి సర్పంచ్ బాధ్యతలను డీపీఓ విజయభాస్కర్‌రెడ్డి అప్పగించారు. ఆరు నెలలలోపు ఖాళీగా ఉన్న సర్పంచ్ పదవికి ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘననివాళి



నరసరావుపేట: నరసరావుపేట ఇంజినీర్స్, ఎల్.టి.పి అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మసాని కమలాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొందిలి శ్రీనివాస్‌సింగ్ కోశాధికారి గంజి అనిల్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



మాట్లాడుతున్న అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్ర స్వామిజీ

సత్తెనపల్లి: యువత చెడు మార్గాల వైపు పయనించకుండా మంచి మార్గంలో ముందుకు వెళ్లాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకు బాలచంద్ర స్వామీజీ అన్నారు. పట్టణం లోని సాయి గాయత్రి ధ్యాన మందిరం ప్రాంగణంలో హైదరాబాద్ అభయ ఫౌండేషన్ వారి సహకారంతో జన చైతన్య సమితి (పెదకూరపాడు)ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శ్రీభవాని డ్రైవింగ్ స్కూలు ద్వారా ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణకు లబ్ధిదారుల ఎంపికను బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా బాలచంద్ర స్వామీజీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో అర్హులైన పేద యువత, మహిళల అభ్యున్నతి కోసం అభయ ఫౌండేషన్ ఎన్నో నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అందులో భాగంగా జన చైతన్య సమితితో కలసి సత్తెనపల్లి కేంద్రంగా ఉచిత డ్రైవింగ్ శిక్షణను ఏర్పాటు చేశామన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో డ్రైవింగ్ లో మంచి నైపుణ్యం సంపాదిస్తే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జన చైతన్య సమితి నిర్వాహకులు దాసరి విజయ్ బెన్నిబాబు, కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు, కోఆర్డినేటర్ వెలిగొటి అనిల్ కుమార్, కట్టమూరు. వెంకటేశ్వర్లు (సాయిరాం), లెర్నర్ దొంతు.రాజేశ్వరరావు, శివ ప్రకాష్, విజయభాస్కర్ ఉన్నారు.

అందరికీ చట్టాలపై అవగాహన అవసరం



సత్తెనపల్లి: అందరికీ చట్టాలపై అవగాహన అవసరం ఎంతైనా ఉందని లీగల్ సెల్ కమిటీ మెంబర్, సామాజిక కార్యకర్త వెలుగూరి సుబ్బారాయుడు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ బి.నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు స్థానిక సుగాలి కాలనీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతుల వారికి చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని మాట్లాడుతూ సమాజంలో అందరూ తమ హక్కులను, విధులను గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావ, పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి, మహిళా పోలీస్ విజయలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'జగనన్నే మా భవిష్యత్'



క్రిస్టియన్‌పాలెంలో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్

నరసరావుపేట: పట్టణంలోని పలు వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్..మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు వార్డుల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వయంగా పాల్గొని ప్రారంభించిన విషయం విధితమే. ఆ మేరకు పలు వార్డుల్లో వార్డు మాజీ కౌన్సిలర్లు, ఇన్‌చార్జీలు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ గత టీడీపీ ప్రభుత్వంలో, ప్రస్తుతం జరుగుతున్న విషయాలను గురించి వివరిస్తున్నారు. వారిచేత మిస్డ్ కాల్ చేయిస్తున్నారు. వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లను అంటిస్తున్నారు. బుధవారం ఐదో వార్డు క్రిస్టియన్‌పాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని సచివాలయాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న నినాదంతో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి సంక్షేమ కరపత్రాలను ఇస్తూ ప్రచారం చేస్తున్నారు. మండలంలోని లాలిపురం గ్రామంలో బుధవారం జడ్పీటీసీ రామావత్ బీమీబాయి ఆధ్వర్యంలో ఇంటింటికి సంక్షేమం గురించి వివరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు లాంటి సంక్షేమ వలన పేదలు, బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా వృద్ధి చెందారని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అలవాలలో...

రొంపిచర్ల: ప్రజా సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎంపీపీ గడ్డం బాల నాగమ్మ వెంకట్రావు అన్నారు. మండలంలోని అలవాల గ్రామంలో బుధవారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పాలనకు గతంలో ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు పాలనపై ప్రజా అభిప్రాయాలను సేకరించారు. పథకాలు అందని అర్హులు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పడాల పడాల సాంబశివారెడ్డి, గాదె రామిరెడ్డి, గడ్డం వెంకట్రావు, షేక్ మహబూబి తదితరులు పాల్గొన్నారు.

రాజుకున్న 'బార్' ఎన్నికల వేడి

పలు పోస్టులకు నామినేషన్లు దాఖలు చేసిన న్యాయవాదులు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గాలి జయప్రకాష్

నరసరావుపేట: స్థానిక న్యాయవాదుల అసోసియేషన్‌కు సంబంధించిన ఎన్నికల వేడి రాజుకుంది. 2023–24 ఏడాదికి సంబంధించి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియలో బుధవారం పలువురు న్యాయవాదులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గాలి జయప్రకాష్, మేదరమెట్ల నాగేశ్వరరావులు తమ మద్దతుదార్లతో కలిసి ఎన్నికల కమిటీ చైర్మన్ ఎస్.అయ్యపరాజు, సభ్యులు కట్టా నారపరెడ్డి, జి.అలెగ్జాండర్ సుధాకర్‌లకు నామినేషన్లు అందజేశారు. అలాగే ఉపాధ్యక్ష పదవికి ఈసారి మహిళలే పోటీపడుతుండగా అమూల్య, నసీమా రాజశేఖర్ నామినేషన్లు వేశారు. ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు పోటీపడుతున్న న్యాయవాదులు నామినేషన్లు అందజేశారు. నామినేషన్ల దాఖలు గడువు 13వ తేదీ గురువారంతో ముగియనుండగా 17న పరిశీలన, 18న ఉపసంహరణ ప్రక్రియ అనంతరం 19న పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. ఎన్నికలు ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నారు.

26లోగా 'వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోండి

సీడీపీఓ అనురాధ

శావల్యాపురం: మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకానికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరణ ఈనెల 26 లోగా తుదిగడువు అని సీడీపీఓ ముదివర్తి అనురాధ బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీఓ అనురాధ మాట్లాడుతూ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో 18 సంవత్సరాల లోపు అనాథలైన బాల బాలికలు, తండ్రిని కోల్పోయిన వారందరూ వితంతువు, విడాకులు తీసుకున్న వారు, కుటుంబం వదిలివేసిన తల్లి పిల్లలు, ప్రాణాంతకర వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, ఆర్థికంగా శారీరకంగా పిల్లలను పెంచలేని నిస్సహాయులు అర్హత పొందుతారన్నారు. ఈపథకం కేంద్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు ఆదాయం కల్గియున్న వారు అర్హత పొందుతారన్నారు. అర్హత పొందిన పిల్లలకు ప్రతి నెల రూ. 4వేలు చొప్పున ఆర్థిక చేయూత ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అర్హత కలిగినవారందరి వివరాలు క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు గుర్తించాలన్నారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్లు గుర్రం శేషకుమారి, కుప్పం శ్రీలత పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



బాధిత కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు దానం చేయడం ఎంతో పుణ్య కార్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పట్టణంలోని ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇస్లాంపేట షేక్ షరీఫుద్దీన్ కుటుంబానికి నిత్యవసర సరుకులు, ఆర్థికసాయం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా నిత్యావసర సరుకులు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గేరా ధర్మారావు, ముద్దా కరిముల్లా, ఉడుముల పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ



మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీడీఏ శివకుమారి

ముప్పాళ్ళ: విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడడం వల్ల, సేంద్రియ ఎరువుల వాడడం తగ్గిపోవడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని పలు రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎమ్.శివకుమారి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతుభరోసా కేంద్రంలో నేల ఆరోగ్య పరిరక్షణ మరియు మట్టినమూనాల సేకరణపై గ్రామవ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న శివకుమారి మాట్లాడుతూ రసాయనాల వాడకం వల్ల నేల చౌడు బారుతుందన్నారు. ఉప్పు నేలగా మారే ప్రమాదం ఉంటుందని చెప్పారు. పరిష్కారంగా భూసార పరీక్ష చేయించుకుని అవసరాన్ని బట్టి ఎరువులను వాడుకుని తద్వారా ఎరువులపై పెట్టే ఖర్చు తగ్గించుకోవాలని, సూక్ష్మపోషక లోపాలు సవరించుకుని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. మన నేలలో సేంద్రియ పదార్థాలు చాలా తక్కువగా ఉన్నాయని, పశువుల, కోళ్ళ ఎరువు, గొర్రెల మేకల మంద కట్టడం, పచ్చిరొట్ట ఎరువు వాడకం వంటివి చేపట్టాలని సూచించారు. కార్యక్రమం అనంతరం క్షేత్రస్థాయిలో మట్టినమూనాలు తీసే విధానం పై అవగాహన కల్పించారు. సమస్యాత్మక నేలలు బాగు చేయడం గురించి, జిప్సం వాడే విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ, ఆయా గ్రామాల వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.